సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 25 । మే । 2025



చీనీ టన్ను రూ.37,800

అనంతపురం మార్కెట్ యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.37,800, కనిష్టంగా రూ.5 వేల ప్రకారం ధర పలికాయి.



ప్రశాంతంగా 'పది' పరీక్షలు

'పది' సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. శనివారం బయాలాజికల్ సైన్స్ పరీక్షకు 3,571 మందికి గాను 2,963 మంది హాజరయ్యారు.

గరిష్టం/కనిష్టం 34.9°/22.7°

జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలతో పాటు ఉక్కపోత తగ్గింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

నమో.. నారసింహ

- ఖాద్రీశుని నామస్మరణతో మార్మోగిన కదిరి




నారసింహుడి దర్శనం కోసం వేలాదిగా తరలివచ్చిన భక్తులు

కదిరి టౌన్: వేసవి సెలవులు... శనివారం కలిసిరావడంతో ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉమ్మడి అనంతపురం జిల్లాల నుంచే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, కర్ణాటక నుంచి కూడా భక్తులు వేలాదిగా తరలిరావడంతో కదిరి కిక్కిరిసిపోయింది. ఉదయమే స్వామి దర్శనం కోసం క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు నమో నారసింహా... అంటూ కాటమరాయుడిని కీర్తించారు. దీంతో కదిరి పట్టణం ఖాద్రీశుని నామస్మరణతో మార్మోగింది. స్వామి కాపులు తలనీలాలు సమర్పించుకున్నారు. సాయంత్రం వేళ మహిళలు దీపాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

ప్రాచీన ఆలయాల పునఃనిర్మాణానికి వినతి

గోరంట్ల: ప్రాచీన ఆలయాలను పునఃనిర్మించాలని చరిత్రకారుడు మైనాస్వామి కోరారు. శనివారం ఆయన మాధవరాయస్వామి ఆలయంలో మీడియాతో మాట్లాడారు. వానవోలు రహదారి పక్కన మల్లెల గుట్టపై విజయనగర రాజుల కాలంలో రెండు ఆలయాలు నిర్మించారన్నారు. ఆ రెండు గుడులూ విధ్వంసానికి గురయ్యాయన్నారు. గుడి ముందు భాగంలో పెద్ద రాతిపై విజయనగర సామ్రాజ్య ప్రభువు రెండో వేంకటపతి రాజు 1,638లో రాయించిన భూదాన శాసనం ఆలయ ప్రాశస్త్యాన్ని తెలుపుతోందన్నారు. మాధవరాయ మరొక ఆలయాన్ని పునఃనిర్మించాలని ఇటీవల పురావస్తు శాఖ కార్యదర్శి అజయ్‌జైన్‌ను కలిసి విన్నవించినట్లు చెప్పారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పదించి, క్షేత్రస్థాయిలో అధికారులతో కలిసి పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారని పేర్కొన్నారు.

గురువుల్లో బదిలీ గుబులు



- ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన టీచర్ల బదిలీలు
- రెండేళ్ల సర్వీస్ పూర్తయితే బదిలీకి అర్హులు
- ఎంటీఎస్ టీచర్లకు వర్తించని స్పౌజ్ పాయింట్లు
- ఎస్జీటీల ఆఫ్‌లైన్ కౌన్సెలింగ్‌పై స్పష్టత కరువు

టీచర్ల బదిలీల్లో మొత్తం ఖాళీలు	క్లియర్ వేకెన్సీలు:	5, 8 ఏళ్లు పూర్తయిన వారు	రీ అపోర్షన్ ఖాళీలు:	దీర్ఘకాలిక సెలవుతో ఖాళీలు
7,750	982	3,826	2,913	29

కదిరి: ఉపాధ్యాయ బదిలీల్లో కూటమి సర్కార్ తీసుకున్న నిర్ణయాలతో గురువుల్లో గుబులు మొదలైంది. ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రాతిపదికన బదిలీలు చేయనుండటంతో పాటు ప్రస్తుతం పని చేస్తున్న పాఠశాలలో రెండేళ్లు పూర్తయిన ప్రతి టీచర్ బదిలీకి అర్హులుగా ప్రకటించారు. ఇప్పటికే దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కాగా, సెకండరీ గ్రేడ్ టీచర్ల మ్యానువల్ కౌన్సెలింగ్‌పై స్పష్టత రాలేదు. అలాగే ఎంటీఎస్ టీచర్లకు స్పౌజ్ పాయింట్లు వర్తింపజేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎంటీఎస్ టీచర్లకు అన్యాయం

దంపతులిద్దరూ ఉద్యోగులైతే బదిలీల్లో ఎవరో ఒకరికి స్పౌజ్ పాయింట్లు ఇస్తారు. అయితే 1998 డీఎస్సీతో పాటు 2008 డీఎస్సీలో అన్యాయానికి గురైన వారికి గత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం మినిమం టైమ్ స్కేల్ (ఎంటీఎస్) పద్ధతిన ఉద్యోగ అవకాశం కల్పించింది. వీరిలో 80 శాతం మంది పదవీ విరమణ దశకు చేరుకున్నారు. అయితే వీరి భార్య లేదా భర్త ప్రభుత్వ ఉద్యోగి అయినట్లయితే వారికి కచ్చితంగా బదిలీల్లో స్పౌజ్ పాయింట్లు కేటాయించాలి. కానీ కూటమి ప్రభుత్వం ఎంటీఎస్ టీచర్లను ఇప్పటికీ తమ వ్యతిరేకులు గానే చూస్తోంది. కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో(కేజీబీవీ)ని టీచర్లకు స్పౌజ్ పాయింట్లు కేటాయిస్తున్న సర్కార్... ఎంటీఎస్ టీచర్లకు మాత్రం మొండిచేయి చూపుతోంది. ఈ చర్యను ఉపాధ్యాయ సంఘాలు తప్పుబడుతున్నాయి. తమకు జరిగిన అన్యాయంపై కోర్టును ఆశ్రయిస్తామని ఎంటీఎస్ టీచర్లు చెబుతున్నారు.

సీలింగ్‌తో సమస్యలు

చాలా మంది టీచర్లు ప్రస్తుతమున్న పాఠశాలలో ఏళ్లుగా పని చేస్తున్నప్పటికీ గరిష్టంగా 8 ఏళ్లకు మాత్రమే పాయింట్లు కేటాయిస్తున్నారు. మిగిలిన కాలాన్ని పరిగణనలోకి తీసుకోవడం లేదు. దీంతో ఇన్నేళ్లుగా మారుమూల ప్రాంతాల్లో పని చేస్తున్న టీచర్లకు తీరని అన్యాయం జరుగుతోంది. వీరు ఆరేడు పాయింట్లు కోల్పోతున్నారు. గతంలో ఇలాంటి సమస్య తలెత్తినప్పుడు అప్పటి వైఎస్ జగన్ సర్కార్ సీలింగ్ విధానాన్ని ఎత్తి వేసింది.

సందిగ్ధంలో ఎస్జీటీలు

ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ మొదలైనప్పటికీ సెకండరీ గ్రేడ్ టీచర్లకు (ఎస్జీటీ) కౌన్సెలింగ్ ఎలా నిర్వహించాలన్న దానిపై కూటమి ప్రభుత్వం ఇప్పటికీ స్పష్టత ఇవ్వలేదు. దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా స్వీకరించినప్పటికీ బదిలీల కౌన్సెలింగ్ మాత్రం ఆఫ్‌లైన్ ద్వారానే చేస్తామని ప్రభుత్వం చెప్పింది. ఈ మేరకు ఉపాధ్యాయ సంఘాల నాయకులతో జరిపిన చర్చల్లో నిర్ణయం తీసుకుంది. కానీ బదిలీల మార్గదర్శకాల్లో మాత్రం ఈ విషయాన్ని ఎక్కడా కనబరచలేదు. ఎస్జీటీలు జూన్ 7 నుంచి 10వ తేదీ లోపు ఆప్షన్స్ ఇచ్చుకుంటే జూన్ 11న బదిలీ ఉత్తర్వులు ఆన్‌లైన్ ద్వారానే వెలువడతాయని మార్గదర్శకాల్లో ఉంది. మరి ప్రభుత్వం చెప్పిన ఆఫ్‌లైన్ సంగతేంటని ఎస్జీటీలు ప్రశ్నిస్తున్నారు.

పారదర్శకంగా నిర్వహిస్తాం

ఉపాధ్యాయ బదిలీలు పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహిస్తాం. ఎవరూ ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దు. టీచర్ల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నాం. నిర్దేశించిన గడువులోపు అందరూ ఆన్‌లైన్ విధానంలోనే దరఖాస్తు చేసుకోవాలి.

-కృష్ణప్ప, జిల్లా విద్యాశాఖ అధికారి

సమన్యాయం చేయాలి



స్పౌజ్ విషయంలో ఎంటీఎస్ ఉపాధ్యాయులను సైతం ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని అందరికీ సమన్యాయం చేయాలి. బదిలీలపై ఉపాధ్యాయ సంఘాల నాయకులతో ప్రభుత్వం జరిపిన చర్యల్లో అంగీకరించిన ప్రతి అంశాన్ని అమలు చేయాలి. ఈ బదిలీల్లో ఏ ఒక్కరికి అన్యాయం జరిగినా మేము ఒప్పుకోం.

– బడా హరిప్రసాద్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు, ఏపీటీఎఫ్ (1938)

సీనియారిటీ పాయింట్లను సరి చేయాలి



తరచూ వస్తున్న మార్పులతో రేషనలైజేషన్‌కు గురవుతున్న ఉపాధ్యాయులకు నష్టం జరగకుండా చూడాలి. అలాగే డ్రాఫ్ట్ రూల్స్ ప్రకారం సీనియారిటీని పరిగణనలోకి తీసుకొని ప్రతి ఏడాదికీ పాయింట్లు ఇవ్వాలి. ఎస్జీటీలకు నిర్వహించే మ్యానువల్ కౌన్సెలింగ్‌పై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి.

-డా.పీవీ రమణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్‌టీఏ

బీసీ మహిళననే కక్షగట్టారు

- ఎమ్మెల్యేలు అమిలినేని, రాజు, దగ్గుపాటిపై తక్షణమే కేసు నమోదు చేయాలి
- జిల్లా ప్రథమ పౌరురాలికే భద్రత లేకపోతే సామాన్యుల పరిస్థితేంటి?
- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ




మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ.. చిత్రంలో అనంత, శైలజనాథ్ తదితరులు

అనంతపురం: బోయ సామాజిక వర్గానికి చెందిన తనను జెడ్పీ చైర్ పర్సన్‌గా నియమించడాన్ని టీడీపీ ఎమ్మెల్యేలు ఓర్వలేకే తన ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహరించారని జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. తన ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించిన టీడీపీ ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, ఎంఎస్ రాజు, దగ్గుపాటి ప్రసాద్, ఇతర నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, మాజీ మంత్రి సాకే శైలజానాథ్, కళ్యాణదుర్గం నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త తలారి రంగయ్య, వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్ర రెడ్డి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ వేదాంతం నాగరత్న, మేయర్ వసీం సలీం, జెడ్పీటీసీలతో కలసి శనివారం ఏఎస్పీ డీవీ రమణమూర్తికి ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో ఆమె మాట్లాడుతూ... ఈ నెల 21న ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతున్న సమయంలో మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అనుమతి లేకుండా తన వ్యక్తిగత చాంబర్‌లోకి వెళ్లి దురుసుగా ప్రవర్తించారన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన తనకు జెడ్పీ చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతగా ఆయన ఫొటోను వ్యక్తిగత చాంబర్‌లో పెట్టుకున్నానన్నారు. వైఎస్ జగన్ ఫొటో ఉండకూడదని ఎమ్మెల్యేలు చెప్పి ఉంటే తమ నాయకులతో చర్చించి నిర్ణయం తెలియజేసేవాళ్లమన్నారు. అలా కాకుండా ముందస్తు అనుమతి లేకుండా చాంబర్‌లోకి వెళ్లి దురుసుగా ప్రవర్తించడం దారుణమన్నారు. బీసీ మహిళ జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఉన్నారనే విచక్షణ లేకుండా ప్రవర్తించి ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారన్నారు. ఈ అంశంలో జెడ్పీ అధికారులకు సంబంధం లేదన్నారు. కానీ, జెడ్పీ సీఈఓను ఎమ్మెల్యేలు దూషించడం బాధాకరమన్నారు. జిల్లాలో చాలా సమస్యలు ఉన్నాయని, వాటిపై చర్చించకుండా ఎమ్మెల్యేలు రాద్ధాంతం చేశారన్నారు. ఉమ్మడి జిల్లా పరిషత్‌లో తొలి మహిళా బీసీ చైర్‌పర్సన్‌గా ఉన్న తనకే భద్రత లేకుంటే ఇక సామాన్యుల పరిస్థితేంటని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో రైతాంగం అకాల వర్షాలతో నష్టపోయిందని, రైతులకు ఏ పథకం అందలేదని గుర్తు చేశారు. మహిళలకు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు చేయలేదన్నారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని సక్రమంగా పరిపాలన చేయాలని హితవు పలికారు. బెదిరింపులకు భయపడేది లేదని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తనతో పాటు జెడ్పీటీసీలకు, జెడ్పీ అధికారులకు భద్రత కల్పించాలని కోరారు.

పక్కా పథకంతోనే..

ఎమ్మెల్యేలు తమ కాలర్స్‌కు మైక్‌లు పెట్టుకుని పక్కా ప్లాన్‌తోనే ఇదంతా చేశారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి దుయ్యబట్టారు. జెడ్పీ చైర్‌పర్సన్ వ్యక్తిగత చాంబర్‌లోకి దౌర్జన్యంగా వెళ్లడమే కాకుండా వ్యక్తిగతంగా ఆమెను కించపరిచిన కళ్యాణదుర్గం, మడకశిర, అనంతపురం ఎమ్మెల్యేలతో పాటు వీడియోలో ఉన్న వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఏఎస్పీని కోరామన్నారు. అనంతపురం కార్పొరేషన్లో కూడా ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడ్డారన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి ఘటనలు జరగడం చాలా దురదృష్టకరమన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్‌తో సహా జెడ్పీటీసీలను భయభ్రాంతులకు గురి చేయాలనే కుట్ర జరుగుతోందన్నారు. మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య మాట్లాడుతూ... ఎంపీలు, ఎమ్మెల్యేలు పదవికి తగ్గట్టు హుందాగా ప్రవర్తించాలని హితవు పలికారు. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ వ్యక్తిగత కార్యాలయంలో వెళ్లి వాళ్లు వాడిన భాష, ప్రవర్తించిన తీరు సిగ్గుచేటన్నారు. అనంతపురం మేయర్ చాంబర్‌లోకి కూడా ఇలాగే వెళ్లి హల్‌చల్ చేయడం దుర్మార్గమన్నారు. కేసులు నమోదు చేసి ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని పోలీసులను కోరారు. పార్లమెంట్‌లో ఎంపీలకు కేటాయించిన గదుల్లో వారి పార్టీ నాయకుల ఫొటోలే ఉంటాయని తలారి రంగయ్య గుర్తు చేశారు. ఎంత గొప్పవాడైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని హితవు పలికారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోకపోతే కాలమే అన్నింటికీ సమాధానం చెబుతుందన్నారు.

రెండు, మూడు రోజుల్లో 'నైరుతి'



నైరుతి రుతుపవనాలు కేరళను తాకినట్లు చూపిస్తున్న ఐఎండీ ఛాయా చిత్రం

అనంతపురం అగ్రికల్చర్: ఆశల 'నైరుతి' (సౌత్‌వెస్ట్ మాన్‌సూన్స్) శనివారం కేరళను తాకినట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అధికారికంగా వెల్లడించింది. వాతావరణం అనుకూలించడంతో 8 రోజుల ముందుగానే రుతుపవనాలు వచ్చినట్లు ప్రకటించారు. 2009లో తొలిసారిగా మే 23న 'నైరుతి' ప్రవేశించగా... 15 యేళ్ల తర్వాత తాజాగా మేలో తాకినట్లు ఐఎండీ ప్రకటించింది. నైరుతి రుతుపవనాల ప్రవేశంపై రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విజయశంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి స్పందించారు. రుతుపవనాలు కేరళతో పాటు దక్షిణ అరేబియా సముద్రంలోని ప్రాంతాలు, పశ్చిమ, తూర్పు మధ్య అరేబియాలోని కొన్ని ప్రాంతాలు, లక్షద్వీప్, కర్ణాటకలో కొన్ని ప్రాంతాలు, తమిళనాడులో చాలా ప్రాంతాలు, మాల్దీవులు, కొమరిన్ ప్రాంతం, నైరుతి, తూర్పు మధ్య బంగాళాఖాతంలో కొన్ని ప్రాంతాలు, మిజోరాంలో కొన్ని ప్రాంతాలకు విస్తరించినట్లు తెలిపారు. వాతావరణం అనుకూలంగా ఉన్నందున రాగల రెండు మూడు రోజుల్లో మధ్య అరేబియా సముద్రం, గోవా, మహారాష్ట్ర, అలాగే ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని ప్రాంతాలు, కర్ణాటక, తమిళనాడులో మరికొన్ని ప్రాంతాలు, పశ్చిమ మధ్య ఉత్తర బంగాళాఖాతంలో మరికొన్ని ప్రాంతాలు, ఈశాన్య రాష్ట్రాలు, పశ్చిమ బెంగాల్, సిక్కిం తదితర ప్రాంతాల్లో విస్తరించే అవకాశం ఉన్నట్లు తెలిపారు.

27న అల్పపీడనం..

ఈనెల 27న అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. దీని ప్రభావంతో రాగల మూడు రోజులు జిల్లాకు తేలికపాటి నుంచి మోస్తరుగా వర్షసూచన ఉందన్నారు. ఉరుములు, మెరుపులతో పాటు కొన్ని ప్రాంతాల్లో 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నట్లు తెలిపారు.

కిట్లు లేకుండా కరోనా టెస్టులా?

- వైద్యవిద్యా సంచాలకుడి జూమ్ మీటింగ్‌లో వైద్యుల ఆవేదన

సాక్షి ప్రతినిధి, అనంతపురం: వ్యాధి నిర్ధారణ కిట్‌లు లేకుండా కరోనా పరీక్షలు చేయడం ఎలా అని వైద్యులు వాపోయినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. ఈ నెల 23న వైద్యవిద్యా సంచాలకులు రాష్ట్రంలోని అన్ని పెద్దాసుపత్రుల వైద్యులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. కరోనా పరిస్థితి ఎలా ఉంది.. ఎన్ని కేసులు నమోదయ్యాయి.. అంటూ ఆరా తీశారు. ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయాలని, వ్యాధి నిర్ధారణ టెస్టులను పెంచాలని ఆదేశించారు. ఈ క్రమంలో వసతుల లేమిపై అనంతపురం మొదలు అన్ని ఆస్పత్రుల వైద్యులు ఆవేదన వ్యక్తం చేశారు. 'లేబొరేటరీలో ఒక్క కరోనా కిట్ కూడా లేదు... ఒక్క పరీక్ష కూడా చేయలేక పోతున్నాం' అంటూ నిట్టూర్చారు. కరోనాతో పాటు ఇతరత్రా టెస్టులకు కూడా ఎలాంటి కిట్లు లేవని, అవి వస్తేగానీ టెస్టులు చేయలేమని స్పష్టం చేశారు.

చేసేదేమీ లేదు...

గత ప్రభుత్వ హయాంలో ప్రతి ఆస్పత్రిలోనూ మైక్రోబయాలజీ లేబొరేటరీలు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే గత ఏడాదిగా ఈ లేబొరేటరీలకు అవసరమైన కిట్‌లు కొనుగోలు చేయలేదు. దీంతో లేబొరేటరీల్లో ఎలాంటి పరీక్షలు సాగడం లేదని వైద్యులు చెబుతున్నారు. ఇప్పుడు కరోనా వచ్చినా చేసేదేమీ లేదని అనంతపురం సర్వజనాసుపత్రికి చెందిన ఒక వైద్యుడు వ్యాఖ్యానించారు. దీనికి తోడు తాజా బదిలీల అంశంతో వైద్యుల్లో ఆందోళన మొదలైంది.

EDUCATION Special Feature

మన పాఠశాల • మన కళాశాల

విద్యార్థుల భవితకు వారధి

ఎడ్యుకేషన్ హబ్‌గా 'అనంత'

అనంతపురం ఎడ్యుకేషన్: కేజీ నుంచి పీజీ వరకు అన్ని కోర్సులూ అందుబాటులో ఉన్న అనంతపురం.. 'ఎడ్యుకేషన్ హబ్'గా మారింది. ఒకప్పుడు పది, ఇంటర్ తర్వాత ఉన్నత విద్య కోసం బయట ప్రాంతాలకు వెళ్లే పరిస్థితి ఉండేది. ఇంకా కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాల విద్య కోసం కూడా బయట ప్రాంతాలకు పంపేవారు. ఇప్పుడా పరిస్థితి చాలావరకు తగ్గింది. విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించడంతో పెద్ద ఎత్తున విద్యా సంస్థలు అందుబాటులోకి వచ్చాయి. వివిధ పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణ కూడా ఇక్కడ అందుబాటులో ఉంది. డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ, బీఈడీ, ఎంబీఏ, ఎంసీఏ, డీఎడ్, ఫార్మసీ, వ్యవసాయ అనుబంధ కోర్సులు ఇక్కడే అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ యాజమాన్యాల విద్యా సంస్థలతో పాటు ప్రైవేట్ విద్యా సంస్థల్లోనూ అంతేస్థాయి కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. జిల్లా కేంద్రంతో పాటు చుట్టూ డిగ్రీ, ఎంబీఏ, పీజీ, ఎంసీఏ, ఫార్మసీ కళాశాలలు వెలిశాయి. చాలా కళాశాలల్లో వసతి సదుపాయం కూడా ఉండడంతో ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి కూడా విద్యార్థులకు సౌలభ్యంగా మారింది. ప్రపంచ స్థాయి పోటీకి అనుగుణంగా విద్యా సంస్థల్లో బోధనతో పాటు విద్యార్థుల్లో ప్రమాణాలు పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. చాలా విద్యా సంస్థల్లో అధునాతన గ్రంథాలయాలు, సైన్స్, గణితం ప్రయోగశాలలు అందుబాటులోకి తెచ్చారు. సువిశాలమైన భవనాలు, ప్రశాంతమైన వాతావరణంలో విద్యా సంస్థలు కొనసాగిస్తుండడంతో మంచి ఫలితాలు సాధిస్తున్నాయి.

నేడు సివిల్స్ ప్రిలిమినరీ

అనంతపురం అర్బన్: యూపీఎస్సీ ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం జరగనుంది. ఏడు కేంద్రాల్లో పరీక్ష జరగనుంది. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం పూర్తి చేసింది. పరీక్షకు 2,546 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. పేపర్–1 (ఉదయం 9.30 నుంచి ఉదయం 11.30 గంటల వరకు), పేపర్–2 (మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 వరకు) జరగనుంది. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు నిర్దేశించిన పరీక్ష సమయం కంటే గంట ముందే చేరుకోవాలి. కేంద్రంలో ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరు. అభ్యర్థులు ఏదేని సమాచారం తెలుసుకునేందుకు లేదా ఫిర్యాదు చేసేందుకు 8500292992 (వాట్సాప్), 08554-220009 నంబర్లతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వృద్ధుడు మృతి



మృతి చెందిన వృద్ధుడు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని దుర్గమ్మ ఆలయం వెనుక బస్టాప్‌లో శనివారం గుర్తు తెలియని వృద్ధుడు అనారోగ్యంతో మృతి చెందాడు. అనాథ శవంగా గుర్తించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించామని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వృద్ధుని ఆచూకి తెలిస్తే ఎస్‌ఐ కేతన్నను లేదా 94948 16259 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో పలువురికి చోటు

పుట్టపర్తి: వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగ కమిటీల్లో జిల్లాకు చెందిన పలువురికి చోటు దక్కింది. రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శులుగా మహాలక్ష్మి, సాయిలీలరెడ్డి, జాయింట్ సెక్రటరీగా భారతిరెడ్డి, రాష్ట్ర ఐటీ వింగ్ జాయింట్ సెక్రటరీగా మురళీకృష్ణారెడ్డిని నియమిస్తూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కాగా కొత్తగా పదవులు దక్కించుకున్న వారు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఒంటరి జీవితంపై విరక్తితో ఆత్మహత్య



దేవరాజ్‌నాయక్ (ఫైల్)

గుడిబండ: ఒంటరి జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి హర్జానాయక్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఎం.రాజ్‌కుల్లాయప్ప తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుడిబండ మండలం దేవరహట్టి పంచాయతీ జీఎస్ తండాకు హెచ్.దేవరాజ్‌నాయక్ (45) భార్య పదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి ఒంటరిగా జీవిస్తున్న దేవరాజ్‌నాయక్ తాగుడుకు బానిసయ్యాడు. ఒంటరి జీవితంపై విరక్తితో శనివారం ఉదయం తమ పొలం వద్దకు వెళ్లి చింత చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెద్దాస్పత్రిపై 'పచ్చ'గద్దలు

కూటమి ప్రభుత్వంలో టీడీపీ నేతల అక్రమాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. సెటిల్‌మెంట్‌లు, భూ కబ్జాలు, ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలు తదితరాలతో జేబులు నింపుకుంటున్న 'పచ్చ' గద్దలు.. తాజాగా ఉమ్మడి జిల్లాలోని పేద ప్రజలకు ఆదరువుగా ఉన్న సర్వజనాస్పత్రిపైనా పడ్డారు. వీరి వసూళ్ల ధాటికి ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది బెంబేలెత్తిపోతున్నారు.

- సర్వజనాస్పత్రిలో టీడీపీ నేతల వసూళ్ల పర్వం
- స్క్రాప్ అమ్మినా తనకే కావాలని ఒక నేత పట్టు
- లోకల్ పర్చేజ్ మందుల కాంట్రాక్టు కోసం మరో నేత బెట్టు
- ఎంపీ లాడ్స్ పనులివ్వకపోతే ఖబడ్దార్ అంటూ ఒకరి దబాయింపు
- శానిటేషన్, సెక్యూరిటీ కాంట్రాక్టర్ల నుంచి ఇప్పటికే మామూళ్లు
- కూటమి నేతల ధాటికి బెంబేలెత్తుతున్న ఆస్పత్రి వైద్యులు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా ప్రజలకు పెద్ద దిక్కైన సర్వజనాసుపత్రి టీడీపీ నాయకుల దెబ్బకు విలవిలలాడుతోంది. లక్షల మందికి వైద్యసేవలు అందించే సర్వజనాసుపత్రిని 'పచ్చ'గద్దలు పీక్కు తింటున్నాయి. బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందడం లేదు.. ప్రమాదంలో గాయపడిన వారికి కట్టు కట్టడానికి దూది లేదు.. బాలింతలకు సరిగా మంచాలూ లేవు.. అయితేనేం తమకు నెలవారీ మామూళ్లు ఇవ్వకుండా ఇక్కడ మీరు పనిచేయలేరంటూ కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు వైద్యుల మెడపై కత్తిపెట్టారు.



పోటాపోటీగా వసూళ్లు..

టీడీపీ నాయకుల మధ్యే వసూళ్ల పోటీ తీవ్రమైనట్లు తెలిసింది. ఇటీవల ఆస్పత్రిలో స్క్రాప్ మెటీరియల్ అమ్మగా.. వచ్చిన సొమ్మంతా తనకే కావాలని స్థానిక ప్రజాప్రతినిధి మనుషులు వైద్యులను బెదిరించారు. ఇప్పటికే మందుల లోకల్ పర్చేజీ కాంట్రాక్టును పట్టుబట్టి మరీ దక్కించుకున్నారు. సెక్యూరిటీ, శానిటేషన్ కాంట్రాక్టర్ల నుంచి నెలవారీ మామూళ్లు వసూళ్లు చేస్తున్నారు. ఇటీవల రూ.40 లక్షల ఎంపీ ల్యాడ్స్ నిధులు వస్తే ఆ పనుల కాంట్రాక్టులనీ తమ వాళ్లకే ఇవ్వాలని ఓ నేత హెచ్చరించారు. టీడీపీ వాళ్లే వసూళ్లకు పోటీ పడుతుండగా మధ్యలో బీజేపీ నేత ఒకరు 'నా సంగతేంటి మరి' అంటూ ఆస్పత్రి సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో ఆస్పత్రిలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియడం లేదంటూ సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

ప్రతి దాంట్లోనూ ఇచ్చుకోవాల్సిందేనట..

ఆస్పత్రిలో జరిగే ప్రతి ఆర్థిక వ్యవహారంలో తమకు ఇచ్చుకోవాల్సిందేనంటూ 'పచ్చ' నేతలు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. మందులు, సర్జికల్ ఉపకరణాలు లోకల్ పర్చేజీ కింద సరఫరా చేస్తున్న సంస్థ 20 శాతం కమీషన్ ఇచ్చితీరాలి. ఆస్పత్రి లేదా మెడికల్ కాలేజీలో పాత సామాన్లు (కుర్చీలు, బీరువాలు, పాత బెడ్‌లు తదితరాలు) విక్రయిస్తే అందులో 50 శాతం వాటా ఇవ్వాలని, సెక్యూరిటీ, శానిటేషన్ కాంట్రాక్టర్లకు సంబంధించి నెలవారీ బిల్లులు వచ్చినా.. రాకపోయినా తమకు ఇవ్వాల్సిందేనని, రోగులకు ఏవైనా ఖరీదైన ఇంప్లాంట్స్ రాస్తే అవి సరఫరా చేసే సంస్థ నుంచి పర్సెంటేజీ ఇచ్చేలా చూడాలని, ఆస్పత్రిలో అభివృద్ధి పనులకు సంబంధించి తమ వాళ్లకు పనులొచ్చేలా సహకరించాలని లేదంటే పెండింగులో పెట్టాలని హుకుం జారీ చేసినట్లు తెలిసింది.

మంత్రి ఇలాకాలోనే ఇలా..

ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీ సత్యసాయి జిల్లాలోని ధర్మవరం నియోజకవర్గ ప్రజలకు కూడా పెద్దాస్పత్రే పెద్ద దిక్కు. అలాంటి ఆస్పత్రిలోనే ఇదంతా జరుగుతుంటే మంత్రి పట్టించుకోక పోవడం విస్మయం కలిగిస్తోంది. వసూళ్ల విషయాన్ని, వైద్య సేవల్లో లోపాలను ఆయన పట్టించుకోకపోతే ఆస్పత్రికి ఇక దిక్కెవరని సిబ్బంది వాపోతున్నారు. గతంలో ఎప్పుడూ ప్రజాప్రతినిధులు ఇంత దారుణంగా వసూళ్లకు ఒత్తిడి చేయలేదని, ప్రస్తుతం ఆస్పత్రిలో పనిచేయడం నిప్పుల కుంపట్లో కూర్చున్నట్లుగా ఉందని ఒక వైద్యుడు ఆవేదన వెలిబుచ్చారు.

చదువుతోనే ఉన్నత స్థాయికి



ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న బెస్త సేవా సంఘం నాయకులు

హిందూపురం టౌన్: బెస్తలు తమ పిల్లలను బాగా చదివించుకుని ఉన్నత స్థాయికి చేరుకునేందుకు కృషి చేయాలని బెస్త సంఘం నాయకులు పిలుపునిచ్చారు. శనివారం హిందూపురం బెస్త సేవా సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన 2024–25 సంవత్సరంలో పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకాల పంపిణీ, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి బెస్త సేవా సంఘం అధ్యక్షుడు బెస్త లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా రిటైర్డ్ తహసీల్దార్ శ్రీరాములు, వెంగముని, గోరంట్ల అధ్యక్షుడు నరేష్ హాజరయ్యారు. అత్యుత్తమ మార్కులు సాధించిన వారికి నగదుతో పాటు ప్రశంసాపత్రం, మొమెంటో, భగవద్గీత అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో బెస్త సేవా సంఘం సభ్యులు శివయ్య, శ్రీనివాసులు, మనోహర్, అనిల్, తిమ్మప్ప, రవి తదితరులు పాల్గొన్నారు.

బాలుడి మరణం బాధాకరం



రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న పీసీఈ

గుంతకల్లు: రైల్వే స్టేషన్‌లో గోడ పెచ్చులూడి మణికంఠ (8) అనే బాలుడు మృతి చెందడం బాధాకరమని దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్ (ఎస్‌సీఆర్‌పీసీఈ) బ్రహ్మానందం అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. శనివారం ఆయన గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో డీఆర్‌ఎం చంద్రశేఖర్‌గుప్తాతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 6, 7వ నంబర్ ప్లాట్‌ఫాంలలోని జనరల్ వెయిటింగ్ హాల్‌లో ప్రమాదం జరిగిన సల్థాన్ని పరిశీలించారు. ఇక్కడి భవనాలను, ఫుట్ ఓవర్ బ్రిడ్జీలు, వెయిటింగ్ హాల్స్‌ను తనిఖీ చేశారు. భవనాల్లోని పైకప్పులు, గోడ తదితర వాటిని క్షుణంగా పరిశీలించి, అక్కడ చేపట్టాల్సిన భద్రతా చర్యలను అధికారులకు తెలియజేశారు. అనంతరం డీఆర్‌ఎం కార్యాలయంలోని మీటింగ్ చాంబర్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. శిథిలావస్థకు చేరిన భవనాలు, వంతెనల గురించి ఆరాతీశారు. అసరమైతే వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం సుధాకర్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఫోర్ మెన్ కమిటీ ఏర్పాటు : మణికంఠ మృతి ఘటనపై ఫోర్ మెన్ కమిటీ ఏర్పాటు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఘటనకు సంబంధించి మణికంఠ తల్లిదండ్రులను కూడా ఫోర్ మెన్ కమిటీ విచారణ చేస్తుంది.

ధర్మ పునరుద్ధరణే సాయి అవతార లక్ష్యం



సత్సంగ్ కార్యక్రమంలో పాల్గొన్న బాలవికాస్ చిన్నారులు, తల్లిదండ్రులు



అవతార సంకల్ప నాటికలోని ఘట్టం



బాలవికాస్ చిన్నారులనుద్దేశించి ప్రసంగిస్తున్న ఆర్‌జె. రత్నాకర్ రాజు

ప్రశాంతి నిలయం: కలియుగంలో ధర్మ పునరుద్ధరణే సత్యసాయి బాబా అవతార లక్ష్యం అన్న సందేశాన్నిస్తూ బాలవికాస్ చిన్నారులు నిర్వహించిన నృత్య ప్రదర్శన భక్తులను పులకింపజేసింది. పర్తియాత్రలో భాగంగా ఒడిశా రాష్ట్రానికి చెందిన 2,500 మంది బాలవికాస్ చిన్నారులు తమ తల్లిదండ్రులతో కలసి పర్తియాత్ర పేరుతో పుట్టపర్తికి విచ్చేశారు. శుక్రవారం ఉదయం సత్యసాయి మహాసమాధి చెంత బాలవికాస్ చిన్నారులు తమ తల్లిదండ్రులతో కలసి సామూహిక సత్యసాయి నామార్చన నిర్వహించారు. అనంతరం పూర్ణచంద్ర ఆడిటోరియంలో సత్సంగ్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు చిన్నారులనుద్దేశించి ప్రసంగించారు. బాల్యదశ నుంచే ప్రతి ఒక్కరూ ఆచరించాల్సిన విధానంపై సత్యసాయి సూచించిన మార్గాన్ని వివరించారు. సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో బాలవికాస్ చిన్నారులు సత్యసాయి అవతార లక్ష్యాన్ని వివరిస్తూ 'అవతార సంకల్ప'పేరుతో నాటిక నిర్వహించారు.

నిరుద్యోగ యువతకు శుభవార్త

- 80 శాతం రాయితీతో కంప్యూటర్ కోర్సులు
- శిక్షణ అనంతరం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

అనంతపురం అగ్రికల్చర్: నిరుద్యోగ యువతకు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ శుభవార్త చెప్పింది. 80 శాతం ఫీజు రాయితీతో కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొంది. ఇందుకు సంబంధించిన వివరాలను ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డి శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఐటీ రంగంలో 18 సంవత్సరాలు అనుభవం కలిగిన శిక్షకులతో అత్యున్నత నాణ్యమైన శిక్షణ ఇస్తామన్నారు. జావా ఫుల్‌స్టాక్, పైథాన్, డేటా ఇంజినీరింగ్ కోర్సుల్లో ఆరు నెలల పాటు శిక్షణ ఉంటుందన్నారు. మార్కెట్‌లో ఉన్న ఫీజులతో పోల్చుకుంటే ఇక్కడ 80 శాతం రాయితీ (కేవలం రూ.5 వేలు మాత్రమే) చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఇంజినీరింగ్ పాస్, ఎంసీఏ పాస్, ఎమ్మెస్సీ కంప్యూటర్స్ కోర్సులు 2022–25 మధ్య కాలంలో చదివిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ ఇవ్వడంతో పాటు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు అనంతపురం శివారులోని ఉప్పరపల్లి వద్దనున్న ఎకాలజీ సెంటర్ లేదా 73969 50345, 83175 94591 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

'చట్ట ప్రకారమే ముందుకెళ్లాం'

అనంతపురం మెడికల్: కదిరికి చెందిన తోట శిరీష, పాముల లక్ష్మీనారాయణ కుటుంబ సమస్యలకు సంబంధించి ఇరు వర్గాల ఫిర్యాదులో భాగంగా చట్టప్రకారమే తాము ముందుకెళ్లామని కదిరి అర్బన్ సీఐ నారాయణ రెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మనస్పర్థల కారణంగా భార్యాభర్త పరస్పరం ఫిర్యాదు చేయడంతో ఇరువైపులా నాలుగు కేసులు నమోదు చేశామని తెలిపారు. శిరీషను బెదిరించారన్న ఆరోపణలతో భర్త లక్ష్మీనారాయణ, కూతురు యషిక, శివ (యషిక భర్త), జగదీష్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశామని, ఈ కేసుకు సంబంధించి స్టేషన్‌కు రమ్మని చెప్పాము తప్పా ఎవరినీ దుర్భాషలాడలేదని పేర్కొన్నారు.

యువతి అదృశ్యం

బత్తలపల్లి: మండల కేంద్రంలోని ఓ కాలనీకి చెందిన యువతి శుక్రవారం అర్ధరాత్రి అదృశ్యమైంది. ఎన్నిచోట్ల వెదికినా కనిపించకపోవడంతో తల్లిదండ్రులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మహిళ బలవన్మరణం

రాయదుర్గంటౌన్: భర్త మరణంతో మానసికంగా కుంగిపోయిన మహిళ శనివారం బలవన్మరణానికి పాల్పడింది. వివరాలిలా ఉన్నాయి. రాయదుర్గం పట్టణంలోని మూడో వార్డులో నివాసం ఉంటున్న వెంకటేశులు కుమార్తె భాగ్యలక్ష్మి (32)కి స్థానికుడైన భీమరాజు అనే గార్మెంట్స్ కార్మికుడితో ఎనిమిదేళ్ల కిందట వివాహమైంది. పెళ్లయిన నాలుగు నెలలకే భీమరాజు మృతి చెందాడు. అనంతరం భాగ్యలక్ష్మి పుట్టింటికి చేరింది. భర్త మరణాన్ని తట్టుకోలేకపోయిన ఆమె పలుమార్లు ఆత్మహత్యకు ప్రయత్నించి విఫలమైంది. ఇదే క్రమంలో మరోమారు శనివారం సాయంత్రం 4.30 గంటల సమయంలో 28వ వార్డులో గల పాలబావిలోకి దూకింది. స్థానికులు గమనించి బయటకు తీసేలోపు మృతి చెందింది. ఘటనపై పోలీసులకు సమాచారం అందించారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు




అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ చేతన్

ప్రశాంతి నిలయం: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని, అటువంటి పరీక్షలు చేసిన వారిపైన, చేయించుకున్నవారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చేతన్ హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో లింగ నిర్ధారణ నిషేధ చట్టం-1994 అమలుపై జిల్లాస్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ సలహా కమిటీ సమావేశాన్ని అడ్వైజరీ కమిటీ సభ్యులు అదనపు జిల్లా జడ్జి శైలజతో కలిసి నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గర్భస్థ శిశువును కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అదనపు జిల్లా జడ్జి శైలజ మాట్లాడుతూ జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షలు సరిహద్దు ప్రాంతాల్లో జరగకుండా చట్టం కఠినంగా అమలు చేయాలన్నారు.

అసంపూర్తి సమాచారంపై ఆగ్రహం

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల సమాచారం లేకుండా డీఎంహెచ్‌ఓ ఫైరోజాబేగం రావడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అసంపూర్తి సమాచారంతో ఆరోగ్య శాఖను ఎలా నడిపాస్తారని మండిపడ్డారు. పనితీరు మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, జిల్లా నర్సింగ్ అధికారి వీరమ్మ, బత్తలపల్లి ఆర్డీటీ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది సంపత్ కుమార్ హత్యకేసులో ఏ2 అరెస్ట్



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మహేష్

హిందూపురం: సంచలనం రేపిన హిందూపురం న్యాయవాది, ఎస్‌ఎస్‌యూఐ నేత సంపత్ కుమార్ హత్య కేసులో పరారీలో ఉన్న నిందితుల్లో ఏ2గా ఉన్న కేసీ నాగార్జునరెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ కేవీ మహేష్ శనివారం తన కార్యాలయంలో మీడియాకు వెల్లడించారు. గతేడాది మే 29 న హిందూపురం పరిసరాల్లో న్యాయవాది సంపత్ కుమార్‌ను హత్య చేసి ధర్మవరం చెరువు వద్ద శవాన్ని పడేసి వెళ్లిన విషయం విదితమే. తొమ్మిది మందిపై కేసు నమోదైంది. అప్పట్లోనే ఐదుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. పరారీలో ఉన్న ఏ1, ఏ2, ఏ3, ఏ5 నిందితులు అరెస్టు కాకుండా కోర్టులో స్టే తెచ్చుకున్నారు. ప్రస్తుతం స్టే గడువు అయిపోయింది. ఈ క్రమంలో ఏ2 అయిన కేసీ నాగార్జునరెడ్డి కర్ణాటకలోని దేవనహళ్లి సమీపంలోని సిగ్నేచర్ క్లబ్ రిసార్ట్ వద్ద ఉన్నట్లు సమాచారం అందింది. ఎస్పీ ఆదేశాల మేరకు హిందూపురం రూరల్ అప్‌గ్రేడ్ సీఐ ఆంజనేయులు, ఎస్‌ఐలు ముని ప్రతాప్, మునీర్ అహమ్మద్, నరేంద్ర పోలీస్ సిబ్బందితో ప్రత్యేక బందంగా వెళ్లి శనివారం అరెస్టు చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరచి, మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ తెలిపారు. మిగిలిన నిందితులను కూడా త్వరలో అరెస్టు చేస్తామని చెప్పారు. సమావేశంలో సీఐలు ఆంజినేయులు, అబ్దుల్ కరీం, రాజగోపాల్‌నాయుడు, ఎస్‌ఐలు ముని ప్రతాప్, మునీర్ అహమ్మద్ పాల్గొన్నారు.

'మహా' వెలవెల

- తూతూ మంత్రంగా జిల్లాస్థాయి మహానాడు
- గత ప్రభుత్వంపై విమర్శలకే ప్రాధాన్యమిచ్చిన నేతలు



మహానాడులో ఖాళీగా ఉన్న కుర్చీలు

పుట్టపర్తి టౌన్: జిల్లా స్థాయి టీడీపీ మహానాడు వెలవెలబోయింది. ఆశించిన స్థాయిలో కార్యకర్తలు రాకపోవడం.. జిల్లా నేతలు కూడా తమ ప్రసంగాల్లో గత ప్రభుత్వంపై విమర్శలకే ప్రాధాన్యం ఇవ్వడంతో వచ్చిన వారు కూడా మధ్యలోనే వెళ్లిపోతూ కనిపించారు. శనివారం పుట్టపర్తి పట్టణ సమీపంలో మామిళ్లకుంట సమీపంలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజప్ప అధ్యక్షతన జిల్లా స్థాయి మహానాడు నిర్వహించారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, హిందూపురం ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యేలు కందికుంట ప్రసాద్, ఎంఎస్ రాజు, పరిటాల సునీత, పల్లె సింధూరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్పతో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు కార్యకర్తలు హాజరయ్యారు. అయితే జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి భారీగా కార్యకర్తలు తరలివస్తారని నేతలు భావించినా... ఆశించిన స్థాయిలో కార్యకర్తలు రాలేదు. దీంతో కుర్చీలన్నీ ఖాళీగా కనిపించాయి.

చర్చకు చోటేదీ..?

మహానాడులో పార్టీకి సంబంధించిన కార్యక్రమాల ఏజెండాలు, వివిధ సమస్యలపై పార్టీ తీర్మానాలపై చర్చ జరిపి ప్రకటిస్తారు. జిల్లా స్థాయి మహానాడు తీర్మానాలను పార్టీ అధిష్టానానికి పంపాల్సింది. పుట్టపర్తిలో మాత్రం కేవలం గత ప్రభుత్వాన్ని తిట్టడానికి మాత్రమే జిల్లా స్థాయి మహానాడు ఏర్పాటు చేసినట్లుగా కనిపించింది. తీర్మానాలపై కనీసం చర్చ కూడా చేయకపోవడంపై కార్యకర్తలు కూడా ఇక తమను ఎందుకు పిలిచినట్లని అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమం చివర్లో అప్పటికే సిద్ధం చేసిన కొన్ని తీర్మానాలు చదివి వినిపించి ముగించారు.